మినీకథ

# వైకల్యం

బి.వి.ఎస్.ఎస్. లక్ష్మి

నిండు గర్భిణి పడుతున్న ప్రసవ వేదనలా మూలుగుతున్నట్లుగా కీచు మంటూ ఆగింది ఆ బస్సు డ్రైవరు వేసిన బ్రేక్‌కి. నిల్చున్న వాళ్ళంత బొంగరాల్లా తిరిగారు.

గేటు దగ్గర టిక్కట్ల నంబర్లు నోట్ చేసుకుంటున్న కండక్టరు మీదికి తూలింది ఆ అమ్మాయి. అంతలోకే సర్దుకుని నిల్చుంది.

"ఏమిటండీ ఇది? ఏమైనా అంటే బాధ పడతారు మళ్ళీ. గట్టిగా పట్టుకుని నిల్చోండి."



ఇదోలా నవ్వుతూ అన్నాడు కండక్టర్.

"సారీ" అందామె ఇబ్బందిగా చూస్తూ.

అందరూ ఆమె మీదకి చూపులు మళ్ళించారు. నేనూ ఇదంత చూస్తూనే ఉన్నాను. వెనకనే ఉండటం వల్ల ఆమె స్పష్టంగా కనిపిస్తోంది. బాగా పొడుగు. పొడుగుకి తగిన ఒళ్ళు. ముఖం, బట్టలు ధరించిన తీరు చూస్తూ ఉంటే చదువు, సంస్కారం ఉన్న పెద్దింటి పిల్లలా ఉంది. జరిగిన దాంట్లో తన తప్పేమీ లేకపోయినా ఆమె చెప్పిన 'సారీ' ఆమె సంస్కారాన్ని తెలియజేసింది.

"ఏం అమ్మాయీ, మీ లాంటి చిన్న పిల్లలే ఆచుకో లేకపోతే నా లాటి ముసలి దాన్ని ఏం కావాలని? కాస్త గట్టిగా పట్టుకో అమ్మా." ఓ ముసలామె సలహా ఇస్తోంది ఆ అమ్మాయికి- ఆ అమ్మాయి కావాలనే అలా చేసినట్లు.

ఆమె వంక చూసి మొహమాటంగా నవ్వి ఊరుకుంది ఆమె.

ఆఫీసుల టైము కావడం వల్ల బస్సు నిండా జనం ఉన్నారు. మధ్య వయస్కు లంతా అదేదో ఎంటర్‌టైన్‌మెంట్‌లా భావించి నవ్వు ముఖాలతో కుతూహలంగా చూస్తున్నారు ఆ అమ్మాయి వంక.

"టికెట్ టికెట్" మళ్ళీ అరుస్తూ వచ్చాడు కండక్టరు.

"అమ్మా అంత గట్టిగా పట్టుకోండి తల్లీ. మళ్ళీ మా మీద పడకండి. ఎక్కడ లేని గొడవలూనూ" జనరల్‌గా అంటున్నట్లు అంటూ ఆమె వేపోసారి చూస్తున్నాడు.

ఆమె వేదాంతిలాగ ఏ భావం లేకుండా రోడ్డు మీదకి చూస్తున్నది. ఇంతలో స్టాప్ వచ్చింది. జనం లోంచి ఆమె కూడా దిగింది. చివరి మెట్టు మీద నుంచి జారిం దామె.

వెనక నించి ఆపాను నేను. "ఏమ్మా?"

నా మాట పూర్తవ కుండానే లేచిం దామె.

"మళ్ళీ పడ్డారా మేడమ్?" గేటు దగ్గర నించీ పరిహాసంగా అన్నాడు కండక్టర్.

జనం నవ్వుతున్నారు అదేదో జోక్‌లా.

"ఓంకార్ ఆఫీసు ఈ సందులోనేనా సార్?" అం దామె.

"అవునమ్మా"

"థ్యాంక్సండీ" ముందుకు కదిలిందామె.

ఆమె అడుగు తీసి అడుగు వేస్తూంటే కలుక్కు మంది నా మనస్సు.

ఆమెకు ఒక కాలు పోలియో కాలు!

వెనక్కి తిరిగి కండక్టరు వైపు చూశాను.

నెత్తురు చుక్క లేనట్లుగా పాలిపోయింది అతని ముఖం.

కొందరి ముఖాల్లో సానుభూతి. కొందరిలో పశ్చాత్తాపం.

ఎందుకో ఆ వైకల్యం ఆమెది కానట్లుగా అనిపించింది నాకు. ఆమెకు ఒక్క కాలే అవిటిది. కానీ ప్రపంచంలోని చాలా మంది వ్యక్తులకు మనస్సే అవిటిది. జీవితం అంతా భరించాల్సి వచ్చినప్పుడు ఎందుకో రెండో వైకల్యం కన్నా అంగవైకల్యమే నయమేమో అనిపించింది నాకు. ■

